క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

పెనుబల్లి/కల్లూరురూరల్: పండ్లతోటలు పెంపకానికి చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని పెనుబల్లి, కల్లూరు ఎంపీడీఓలు కావూరి మహాలక్ష్మి, రవికుమార్‌లు తెలిపారు. ఉద్యానవన శాఖ, ఉపాధిహామీ పథకం సంయుక్తంగా మామిడి, జామ, దానిమ్మ, సీతాఫలం, మునగ, డ్రాగన్, నేరేడిపండు, కొబ్బరి మొక్కలు, సపోట, బత్తాయి, ఆయిల్ ఫాం వంటి మొక్కలు పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు అర్హులుని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీతో, ఇతరులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కలదని, ఆసక్తిగల రైతులు పట్టాదార్ పుస్తకం, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లతో పాటుగా 3పాస్‌పోర్టు సైజు ఫొటోలతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాని, ఉపాధిహామీ కార్యాలయంలో గాని జూలై 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైరా లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



గ్రేటర్‌విజన్ లయన్స్‌క్లబ్ బాధ్యులకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ మోహన్‌రావు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ స్థాపించిన మొదటి ఏడాది ఉత్తమ క్లబ్ అవార్డు గెలుచుకుని రికార్డు సృష్టించిందని క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం డిస్ట్రిక్ట్ అవార్డు ఫంక్షన్‌లో నూతన బెస్ట్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీధర్‌గౌడ్ అవార్డు గెలుచుకున్నారు. విజన్, డయాబెటిక్, హంగర్ రిలీఫ్, ఎన్విరాన్‌మెంట్ తదితర విభాగాలలో క్లబ్‌కు అవార్డులను గవర్నర్ తీగల మోహన్‌రావు అందజేశారు. క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్‌గా డాక్టర్ కాపా మురళీ కృష్ణ అవార్డును గెలుచుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్‌రాయ్‌లను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉంద్రు శ్యాం బాబు, కొమ్మినేని భారతి, లగడపాటి ప్రభాకర్, కొమ్మినేని శివప్రసాద్, ఉంద్రు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు పరిశీలన



సరిహద్దు వద్ద పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ముదిగొండ: మండలంలోని వల్లబిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దును ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి పరిశీలించారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్‌ను సీఐ సందర్శించి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌ను నూతన హంగులతో అత్యాధునికీకరణ చేపట్టిన ఎస్సై నరేష్‌ను అభినందించారు.

టీబీ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అల్తాఫ్

తల్లాడ: టీబీవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అల్తాఫ్ అన్నారు. తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో శనివారం టీబీవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీవ్యాధి గురించి ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. టీబీ ఒక సాధారణమైన జబ్బుగానే పరిగణించాలన్నారు. టీబీ సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సురేష్, సరస్వతి పాల్గొన్నారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి

ఏన్కూరు: కార్మికుల సమస్యల సాధనకై ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలో కార్మిక గర్జన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులందరు పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, చారి, శ్రీను, నారాయణ, రాజశేఖర్, ఉపేందర్ రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


రేపు సర్వసభ్య సమావేశం

ఏన్కూరు: ఈ నెల 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బయ్యారపు అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావలసిందిగా కోరారు.

క్షణక్షణం.. భయం భయం

- శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయం
- బీటలు వారిన గోడలు
- శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- బిక్కు బిక్కు మంటూ సిబ్బంది విధులు





వర్షానికి గోడలకు చెమ్మదిగి, నెర్రలువారిన దృశ్యం



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ కార్యాలయం

ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గత కొంత కాలంగా గోడలు బీటలువారగా, శ్లాబులు పెచ్చులూడి పడుతున్నాయి. పిల్లర్లు బెడ్డింగ్‌పోయి సువ్వలు బయటకు అగుపడుతున్నాయి. దీంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

బోనకల్: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో గత 33 సంవత్సరాల క్రితం ఎంపీడీఓ భవనాన్ని రూ.6లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్వహణ లోపం మరియు ఇక్కడి స్థలం నల్లరేగడి భూమి కావడంతో.. నిర్మించిన కొన్ని సంవత్సరాలకే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇటీవల ఈ భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ స్లాబుపై పెచ్చులు ఊడి సువ్వలు బయటపడ్డాయి. ఈ విషయమై అధికారులు నూతన భవన నిర్మాణం కోసం కలెక్టర్‌కు విన్నవించగా.. ఎస్టిమేట్ పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఎస్టిమేట్ నివేదికను పంపించారు. అయినా నిధులు మంజూరు కాలేదు.

వర్షాలు కురుస్తుండడంతో..

గత 5 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భవనం మొత్తం చెమ్మదిగి, గోడలు నెర్రలువారి, స్లాబు కురుస్తుంది. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకుంది..



మండల పరిషత్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశాం. భవనం గోడలు నెర్రలు బారడమే కాకుండా వర్షాలకు కురుస్తుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కావున అధికారులు నిధులు మంజూరు చేయాలి.

– కంకణాల సౌభాగ్యం, ఎంపీపీ

ఉన్నతాధికారులకు నివేదించాం..



నూతనభవన నిర్మాణం కోసం ఇంజనీరింగ్ అధికారులతో ఎస్టిమేట్ వేయించి ఉన్నతాధికారులకు పంపించాం. ఇటీవల మండల పరిషత్ నిధులతో తాత్కాలిక మరమ్మతులు కూడా చేయించాం. ఈ భవనం విషయమై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వేణుమాదవ్, ఎంపీడీఓ

'కొండూరు' క్యాంప్ కార్యాలయం ప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని సిద్దారం రోడ్‌లో ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ క్యాంప్ కార్యాలయాన్ని శనివారం టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈమేరకు తొలుత పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి, పక్కన సుధాకర్ తదితరులు

మండలంలో పొంగులేటి పర్యటన..

పెనుబల్లి: మండలంలోని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యానికి గురైన వీయంబంజర్‌కు చెందిన నాగప్రసాద్, చెన్నమ్మలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెన్నమ్మకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వంగా దామోదర్ ఇంట్లో ఆ గ్రామ యువత పొంగులేటికి శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, చిన్నస్వామి, రాధాకృష్ణ, నవజీవన్, శ్రీనివాసరావు, నరసింహారావు, లక్ష్మణరావు, షణ్ముఖ, వంశీ, సురేష్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సతుపల్లి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తల్లాడ: టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులయ్యాక పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారి శనివారం సత్తుపల్లిలో జరిగిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తల్లాడ రింగ్ సెంటర్ నుంచి కార్లతో ర్యాలీగా వారు బయలుదేరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న రాందాస్ నాయక్

కారేపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ సభ్యుడు, వైరా నియోజక వర్గ నాయకుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని గాంధీనగర్, గుట్టకిందిగుంపు గ్రామాల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఈ దఫా అధికారంలోకి తీసుకురాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ.. రాక్షస పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటి నర్సయ్య, సట్టి వీరభద్రం, కాపా చంద్రశేఖర్, కాపా సుధాకర్, భద్రయ్య, మేదరి టోనీవీరప్రతాప్, హీరాలాల్, భీముడు, నాగవేణి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సత్తుపల్లిరూరల్/ఏన్కూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలు, క్రైస్తవులపై దాడులు చేస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, పాస్టర్ అద్భుతకుమార్ కోరారు. సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీ బైబిల్‌మిషన్ చర్చిలో, ఏన్కూరులోని ఫ్రాన్సిస్ చర్చి ఆవరణలో శనివారం మండల పాస్టర్ల ఫెలోషిప్ సేవకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న దాడులను ఖండించాలని ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లిలోని టీఎస్‌యూటీఎఫ్ సత్తుపల్లి, అశ్వారావుపేట డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో మండల అధ్యక్షులు బేతంపూడి వరప్రసాద్, రవికిరణ్, విజయ్‌కుమార్, శ్యామ్‌సన్, మ్యాథ్యూస్, ఏసన్న, చార్లెస్, కరుణతేజ, రాంబాబు, ఏసుపాదం, టి.ఫ్రాన్సిస్, అనీల్, రాము, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా బాధ్యులు జి.రమేష్, నిర్మలకుమారి, ఆర్.రమేష్, భాను, కిషోర్, నాగమణి, శ్రీనివాసరావు, ప్రసాద్, బాలయ్య, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీను, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి రూ.50 వేలు చెక్కు అందజేస్తున్న సభ్యులు

వైరా: ఇంటర్మీడియట్ చదువుతున్న వైరాకు చెందిన జి.వెంకట నాగ సోహిత్ విద్యార్థికి మేమున్నాం స్వచ్ఛంద సంస్థ.. దాతల సాయంతో సేకరించిన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని శనివారం రిటైర్డు ఉపాధ్యాయులు సూర్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. సోహిత్ దాతల సాయంతో చదువుతూ ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 470కి గాను 464 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. కార్యక్రమంలో సభ్యులు సాయిరామకృష్ణ, వరుణ్ భార్గవ్, సత్యం పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కల్లూరు రూరల్: అంటువ్యాధులు ప్రబల కుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెన్నూరు పీహెచ్‌సీ వైద్యురాలు తబస్సుం అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరులోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైడ్ డ్రెయిన్లలోని మట్టిని తొలగించాలని, ఎవరైనా రెండు రోజులు పాటు జ్వరం వచ్చినట్లయితే వెంటనే ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

మల్లు నందిని పరామర్శ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు నందిని

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పిడకల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని మల్లు నందిని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, పీసీసీ కార్యదర్శి బందం నాగేశ్వరరావు, నాయకులు గంగసాని రాఘవరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెలూన్ షాపునకు నిప్పు పెట్టిన దుండగులు

మధిర: మండలంలోని మల్లారంలో ఎర్రనాగుల మురళికి చెందిన సెలూన్ దుకాణంపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి షాపుతో పాటు సామగ్రి కాలిపోయాయని, రూ.20 వేల ఆస్తినష్టం జరిగిందని యజమాని వాపోయాడు. ఈ మేరకు బాధితులను శిక్షించి తనను ఆదుకోవాలని కోరారు.


కేసు నమోదు

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్ ఖాన్‌పేటకు చెందిన వివాహిత అదృశ్యంపై శనివారం కేసు నమోదైంది. సదరు వివాహిత ఈనెల 19వ తేదీన రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో వారు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుబల్లి: మండలంలోని వీఎంబంజర్‌లో సప్తపది ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన తాళ్ల శ్రీను మండలంలోని అడవిమల్లేల రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న కుమార్తె వద్దకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వెళ్లుతున్న కారు ద్విచక్రవాహాన్ని ఢీకొట్టంతో శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా పెనుబల్లిలో చికిత్సఅనంతరం ఖమ్మం తరలించారు.

ఈర్ష్యాద్వేషాలే మానవమనుగడకు అవరోధాలు



చాగంటి కృష్ణమూర్తి

కారేపల్లి: మానవ మనుగడకు ఈర్ష్యాద్వేషాలు అవరోధాలుగా మారాయని, ఎప్పుడైతే మానవులు వీటిని విడనాడతారో అప్పుడు శాంతియుత సమాజం ఏర్పడుతుందని రచయిత, సామాజిక ప్రభోదకులు చాగంటి కృష్ణమూర్తి తెలిపారు. కారేపల్లి శివాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనుషుల మధ్య అంతరాలు పెరిగి అనైతికత, అరాచకత్వం రాజ్యమేలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ మేరకు తన వంతుగా సమాజంలో రుగ్మతల నిర్మూలనకు కృసి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, మండలంలోని కొత్తకమలాపురానికి చెందిన కృష్ణమూర్తి 88 ఏళ్ల వయస్సులో సైతం సమాజంలో రుగ్మతల తొలగింపునకు కృషి చేయటం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన రచనలకు పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఎన్నో అవార్డులు అందుకున్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగడదాం

చింతకాని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని బస్వాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు భరోసా యాత్రలను విజయవంతం చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరికీ రైతు రుణమాఫీ చేసి, పంట నష్టపరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, నాయకులు కన్నెబోయిన గోపి, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున్, షేక్ షాజహాన్, పాండురంగారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: ఈ నెల 24న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా వైరా నియోజకవర్గంలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదు మండలాలనుంచి 10వేల మందితో భారీగా ర్యాలీ నిర్వహించి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలపాలన్నారు. అనంతరం వైరా ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ ర్యాలీ విజయవంతానికి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, ర్యాలీలో పాల్గొనే ప్రతీ కార్యకర్తకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అదృష్టం కలిసొస్తే మంత్రి పదవి కూడా వస్తుంది..

వచ్చే ఎన్నికలలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని వైరాలో కూడా తానే గెలుస్తానని అన్నీ సక్రమంగా జరిగితే మంత్రి పదవి దక్కినా ఆశ్చర్యం లేదని ఎమ్మెల్యే అన్నారు. ఓ వైపు శత్రువు, మరో వైపు కాంపిటీటర్‌లు తొడగొడుతూ.. యుద్దానికి సై అంటున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అలసత్వాన్ని వీడి ఉత్సాహంగా పని చేయాలన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మణ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ప్రధాన రహదారి నుంచి వెళ్లే రహదారి గుంతలమయంగా మారటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లగా.. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

అసత్య ఆరోపణలు చేస్తే సహించం



సమావేశంలో పాల్గొన్న మాదిగ సమాఖ్య నాయకులు

కల్లూరు: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండల మాదిగ సమాఖ్య నాయకులు కొరకొప్పు ప్రసాద్, బొక్కా వెంకటేశ్వర్లు, పరిగడపు రాములు అన్నారు. శనివారం కల్లూరు మండల మాదిగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేదికగా యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ ఎస్.శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావులు ఉద్దేశ పూర్వకంగా తప్పుడు కథనాలు సృష్టిస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే 14 సంవత్సరాలుగా సత్తుపల్లి నియోజకర్గంలో ఏ అభివృద్ధి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై మీరు ఏ గ్రామంలో చర్చకు పిలిచినా తాము సిద్ధమేనన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రసాద్, వెంకటేశ్వరరావు, విజయారావు, రమేష్, వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వివాదంపై విచారణ

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలో ఇరువర్గాల రైతుల మధ్య తలెత్తిన వివాదాన్ని శనివారం మధిర ఏడీఈ అనురాధ, ఎస్సై సురేష్‌లు విచారణ జరిపారు. గ్రామానికి చెందిన మహిళా రైతు గొల్లపూడి నాగమ్మ, మరి కొందరు రైతులకు ఇందిర జలప్రభ స్కీం ద్వారా 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను 2015 సంవత్సరంలో అప్పటి అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి ఇచ్చారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌పై మరో రైతు విద్యుత్ కనెక్షన్‌కు డీడీ చెల్లించగా ఆ రైతుకు కూడా కనెక్షన్ ఇచ్చారు. దీంతో గత కొంత కాలంగా వీరిద్దరి మధ్య వివాదం నడుస్తుంది. దీంతో ఏడీఈ, ఎస్సై, ఏఈ శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. సమస్య పరిష్కరిస్తామని, వివాదాలకు పాల్పడొద్దని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రావు, ఉప సర్పంచ్ రాధిక, పలువురు రైతులు పాల్గొన్నారు.



మామునూరులో విచారణ జరుపుతున్న ఏడీఈ అనురాధ, ఎస్సై సురేష్

ఆలయంలో అన్నదానం



మధిర: వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

మధిర: మధిర బంజారా కాలనీలో ఉన్నటువంటి శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దాతలు కటికల శివారెడ్డి, సుమతి, చల్లా సత్యనారాయణ, వెంకట కళావతి దంపతులు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొండెల ముత్తయ్య, సభ్యులు కటకం నర్సింహారావు, గంగవరపు వీరారెడ్డి, ఆవుల శ్రీనివాసరావు, బోనాల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతా జ్ఞాన మందిరంలోగల శ్రీపార్థసారధి స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గుండు ప్రసాద్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగిరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తం, రాఘవయ్య, లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

పంట పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు



సత్తుపల్లి మండలంలో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బేతుపల్లి పెద్దచెరువు ఆయకట్టు, తాళ్లమడ – రామానగరం రహదారి పక్కన ఉన్న వరిపొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ విద్యుత్ స్తంభాలు ఒరిగి చేతికందే ఎత్తులో తీగలు ఉండడంతో స్థానికులతో పాటు వ్యవసాయ కూలీలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. కావున సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.

– సత్తుపల్లిరూరల్